క్లుప్తంగా

నేడు విద్యుత్ సమస్యలపై శిబిరం

తిరుపతి రూరల్ : తిరుపతి నగరం, రూరల్ డివిజన్ల పరిధిలోని విద్యుత్ సమస్యల పరిష్కరమే లక్ష్యంగా బుధవారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఈఈలు వాసుదేవరెడ్డి, వాసురెడ్డి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. తిరుపతిలోని రూరల్, నగర డివిజన్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే శిబిరంలో వినియోగదారుల తమ విద్యుత్ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయవచ్చని సూచించారు.

అవార్డు గ్రహీతలకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ

తిరుపతి సిటీ : హైదరాబాద్‌లోని అంబేడ్కర్ లా కాలేజ్ వేదికగా రెండు రోజుల క్రితం నిర్వహించిన కాకా వెంకటస్వామి మెమోరియల్ జాతీయ స్థాయి మూట్ కోర్టు కాంపిటీషన్‌లో ఎస్వీయూ లా కాలేజ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి అవార్డు సాధించారు. మంగళవారం ఈ మేరకు సత్తాచాటిన విద్యార్థులను ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ అప్పారావు అభినందించా రు. వర్సిటీ గర్వించేలా ప్రతిభ కనబరిచి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.సుధ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మనాభం, న్యాయ విభాగం డీన్ వీఆర్‌సీ కృష్ణయ్య పాల్గొన్నారు.

రీసెర్చ్ సెంటర్ కోసం వినతి

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో వాల్మీకి రీసెర్చ్ సెంటర్ ఆన్ రామాయణానికి అనుమతి ఇవ్వాలని విజయనగరంలోని ఎన్వీఎస్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు నాగేశ్వరరావు కోరారు. మంగళవారం ఈ మేరకు వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తికి వినతిపత్రం సమర్పించారు. ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ రామాయణానికి సంబంధించి ప్రతి అంశాన్ని వాల్మీకి రీసెర్చ్ సెంటర్ ద్వారా పరిశోధనలు చేయడం, ఆర్టికల్స్ పబ్లిష్ చేయడం, పలు భాషాగ్రంథాలను సేకరించడం వంటి కార్యక్రమాలు రీసెర్చ్ సెంటర్ ద్వారా కొనసాగించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమాశ్రీ, డీన్ రజనీకాంత్ శుక్లా, వైవీ కృష్ణారావు పాల్గొన్నారు.

తిరుమలలో వీజీఓల బదిలీ

తిరుమల : తిరుమలలో పనిచేస్తున్న ఇద్దరు వీజీఓలను బదిలీ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. విజిలెన్స్ వింగ్ వీజీఓ గిరిధర్‌రావును ఏపీ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన స్థానంలో ఎస్‌టీవీ రామ్‌కుమార్‌ను నియమించారు. అలాగే తిరుమల విజిలెన్స్ వీజీఓ బాలిరెడ్డిని మంగళగిరి హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ఆ స్థానంలో ఏ.సురేంద్రను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు.

కమనీయం.. కల్యాణం

పాకాల : సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో మంగళవారం కమనీయంగా స్వామివారి కల్యాణం జరిపించారు. కోరా సుబ్రమణ్యనాయుడు, సుబ్రమణ్యంరెడ్డి, ఆముదపాకుల ఆదికేశవనాయుడు, శ్రీహరినాయుడు, చంద్రశేఖర్‌నాయుడు కుటుంబీకులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

జాతీయస్థాయి పోటీలకు బీసీఎం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

తిరుపతి మంగళం : నంద్యాలలో ఇటీవల నిర్వహించిన అండర్-12, 14 బాల బాలికల జంప్ రోప్ పోటీల్లో మంగళంలోని బీసీఎం స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 8 మంది విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం ఈ మేరకు ప్రతిభ కనబరచిన విద్యార్థులు, అత్యుత్తమ శిక్షణ ఇచ్చిన పీఈటీ ప్రమీలను పాఠశాల వ్యవస్థాపకుడు కృష్ణమూర్తి నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రియ, ప్రిన్సిపల్ సుకన్య పాల్గొన్నారు.

కళాశాలల ఏర్పాటుకు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న స్టూడెంట్స్ జేఏసీ నేతలు

తిరుపతి సిటీ : తిరుపతి నగరంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నేతలు కోరారు. మంగళవారం ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎడ్యుకేషనల్ హబ్‌గా పేరుగాంచిన తిరుపతిలోని విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న టీటీడీ కళాశాలల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల విద్యార్థులకు అవకాశం కల్పించడంతో, స్థానికులకు సీట్లు లభించడం లేదని వాపోయారు. నియోజకవర్గంలో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతోందని మండిపడ్డారు. కార్పొరేట్ విద్యాసంస్థలల్లో చేరలేని ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై దృష్టి సారించి ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అదును చూసి ఆక్రమణ



ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న షెడ్లు

- శిల్పాల తయారీ పేరుతో ప్రభుత్వ స్థలంలో పాగా
- కొంచెం కొంచెంగా ఎకరా భూమి కబ్జా
- ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్ల నిర్మాణం
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం
- రాతి దుమ్ము కారణంగా రోగాల బారిన జనం

తిరుపతి మంగళం : తమిళనాడు నుంచి కొంత కాలం క్రితం కొందరు శిల్పాలు తయారీదార్లు తిరుపతికి చేరుకున్నారు. మంగళం కోళ్ల ఫారమ్ వద్ద ప్రభుత్వ స్థలంలో కాలుమోపారు. చిన్న రేకుల ఇల్లు అద్దెకు తీసుకుని, దాని ముందు టెంకాయ కీతులతో పందిరి ఏర్పాటు చేసుకున్నారు. శిల్పాలను తయారు చేసుకుని జీవనం మొదలుపెట్టారు. క్రమేణా ఆర్డర్లు పెరగడంతో పెద్ద పెద్ద శిల్పాలను సైతం తీర్చిదిద్దడం ప్రారంభించారు. తర్వాత అద్దెకు తీసుకున్న ఇంటి ముందు స్థలం సరిపోకపోవడంతో ఎదురుగా సర్వే నంబర్ 226లోని ఎకరా ప్రభుత్వ భూమిపై కన్నేశారు. ముందుగా అందులో గుడిసెలు వేసుకున్నారు. అక్కడే శిల్పాలను తయారు చేసే ప్రక్రియ చేపట్టారు. అప్పట్లో ఈ విషయం తెలుసుకున్న మంగళం పంచాయతీ అధికారులు వెంటనే అభ్యంతరం వ్యక్తం చేశారు. వాటిని తొలగించాలని ఆదేశించారు. అయితే గుడిసెలను ఎండకు వేసుకున్నామని, తామే తీసేస్తామని చెప్పడంతో అధికారులు మిన్నకుండిపోయారు. అదే అదునుగా శిల్పాల తయారీదార్లు భావించారు. తమకు అడ్డూ అదుపు ఉండదని భావించారు. మొత్తం ఎకరా ప్రభుత్వ భూమిని సొంతం ఆక్రమించేసుకున్నారు. అందులో పెద్ద పెద్ద షెడ్లను నిర్మించేస్తున్నారు.

బతుకుదెరువుకోసం తమిళనాడు నుంచి వలస వచ్చారు. ముందుగా చిన్న రేకుల ఇల్లును అద్దెకు తీసుకున్నారు. పొట్ట పోసుకునేందుకు రాతి శిల్పాల తయారీని ప్రారంభించారు. వ్యాపారం పుంజుకోవడంతో ఎదురుగా కనిపించిన ప్రభుత్వ స్థలంపై కన్నేశారు. పట్టించుకునే వారు లేకపోవడంతో చిన్నగా గుడిసెలు వేసేసుకున్నారు. అదేంటని ప్రశ్నించిన వారికి ఎండలో నీడ కోసం పాకలు ఏర్పాటు చేసుకున్నామంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పారు. క్రమేణా కొద్దిగా కొద్దిగా కబళిస్తూ మొత్తం ఎకరాను కబ్జా చేసేశారు. చివరకు రూ.కోట్ల విలువైన భూమిలో దర్జాగా షెడ్లు నిర్మించేస్తున్నారు.

స్థానికుల ఆవేదన

మంగళం కోళ్ల ఫారమ్ వద్ద రాత్రింబవళ్లు తయారు చేస్తున్న రాతి శిల్పాల నుంచి వచ్చే దుమ్ము ధూళితో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ నుంచి వచ్చే శబ్దాలతో ఇళ్లలో కూడా ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. నివాస ప్రాంతంలో శిల్పాల తయారీని ఎలా అనుమతిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. శిల్పాల తయారీ సమయంలో వచ్చే దుమ్ముతో ముఖ్యంగా చిన్నపిల్లలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టీపట్టనట్లు అధికారులు

చెన్నాయగుంట లెక్క దాఖలా సర్వే నంబర్ 226లోని ఎకరా ప్రభుత్వ స్థలంలో శిల్పాల తయారీదారులు పెద్ద పెద్ద రేకుల షెడ్లను నిర్మిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నిరుపేదలు ఎక్కడైనా చిన్నపాటి గుడిసె వేసుకుంటే వెంటనే వచ్చి వాటిని కూల్చేసే అధికారులకు ఇంత పెద్ద రేకుల షెడ్లు కనపడవా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. శిల్పాల తయారీదారులకు ప్రభుత్వ స్థలాన్ని అప్పనంగా ఏమైనా రాసిచ్చేశారా? అని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు దృష్టి సారించి రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు. అలాగే తమను రోగాల బారిన పడకుండా రక్షించాలని విన్నవిస్తున్నారు.

వెంటనే తొలగిస్తాం : ఇన్‌చార్జి తహసీల్దార్

మంగళం కోళ్ల ఫారమ్ వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న రేకుల షెడ్లను వెంటనే తొలగిస్తామని తిరుపతి అర్బన్ ఇన్‌చార్జి తహసీల్దార్ అశోక్ రెడ్డి తెలిపారు. శిల్పాల తయారీదార్లపై ఫిర్యాదులు రావడంతో అక్కడకు వెళ్లి పరిశీలించామని, అలాగే వారిని హెచ్చరించామని వెల్లడించారు. ఆదేశాలను అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

తిరుపతి లీగల్ : నిత్యం కేసులతో టెన్షన్ పడే న్యాయవాదులు తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు టి.గోపీచంద్ సూచించారు. మంగళవారం తిరుపతి కోర్టు ఆవరణలో సంకల్ప ఆస్పత్రి సహకారంతో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ న్యాయవాదులు ఆరోగ్యంగా ఉండేందుకు హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య రక్షణకు ఈ శిబిరాలు ఉపయోగపడతాయని వెల్లడించారు. క్యాంపులో న్యాయవాదులు, గుమస్తాలకు ఉచితంగా రక్త పరీక్షలు, ఈసీజీ, ఇతర టెస్టు నిర్వహించి రిపోర్టులను అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి మార్టిన్, సంకల్ప ఆస్పత్రి యజమాని డాక్టర్ నాగరాజురెడ్డి పాల్గొన్నారు.

మత్తు మహమ్మారిపై అవగాహన



మాట్లాడుతున్న డీఎస్పీ

తిరుపతి క్రైమ్ : నగరంలోని ఆయుర్వేద కళాశాలలో విద్యార్థులకు మత్తు మహమ్మారి కారణంగా తలెత్తే అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. డీఎస్పీ రవిమనోహరాచారి మాట్లాడుతూ యువత మత్తుకు బానిసలు కాకూడదని కోరారు. నేటి ఆధునిక సమాజంలో డ్రగ్స్ వాడకం యువతను నాశనం చేస్తోందన్నారు. ఇలాంటి మహమ్మారికి యువత దూరంగా ఉండాలని సూచించారు. అలాగే తోటి విద్యార్థులను గౌరవించాలని, ర్యాగింగ్ పాల్పడకూడదని స్పష్టం చేశారు. నూతన పరిజ్ఞానం ద్వారా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని, దీనికి విద్యావంతులు కూడా బాధితులవుతున్నారని వెల్లడించారు. నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మోకాళ్లపై ఎక్కి.. పట్టువస్త్రాలు సమర్పించి



మోకాళ్లపై మెట్లు ఎక్కుతున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పాకాల: స్థానిక ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. మంగళవారం వేకువ జామున తుమ్మలగుంట కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ఆనవాయితీ ప్రకారం స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ముందుగా వినాయకస్వామిని దర్శించుకున్న చెవిరెడ్డి మెట్ల మార్గం గుండా మోకాళ్లపై ఎక్కి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, దేవదేవతలకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ మర్యాదలతో తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ దర్శనానికి విచ్చేసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని చూసి భక్తులు ఆప్యాయంగా పలకరిస్తూ కరచాలనం చేశారు.

ఏటా మోకాళ్లపై కొండ ఎక్కుతున్న చెవిరెడ్డి

ప్రతీ ఏడాదీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మోకాళ్లపై ఎక్కి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారు. ఈ క్రమంలో ఉదయం 5.30 గంటలకు తుమ్మలగుంట శ్రీ కళ్యాణవెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పయనమై 6.30 గంటలకు ఆనందగిరికి చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయన భక్తికి మెచ్చుకుంటూ సహచర భక్తులు అర్థం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు చుట్టుపక్కల నాయకులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు తీసుకెళుతున్న చెవిరెడ్డి

పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి కల్చరల్: తిరుపతి శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలకు మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. అందులో భాగంగా సాయంత్రం 6 గంటల నుంచి సేనాధిపతి ఉత్సవం, మేధిని పూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణ ఘట్టాలు జరిపించారు. బుధవారం యాగశాలలో పవిత్ర ప్రతిష్ఠ, శయనాధివాసం, ఆగస్టు 1న పవిత్ర సమర్పణ, యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 2న యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, ఆలయ ప్రధాన అర్చకుడు ఆనందకుమార్ దీక్షితులు, సూపరింటెండెంట్ సోమశేఖర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

తిరుపతి తుడా : తిరుపతి రుయాలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని ఏఐటీయూసీ నేతలు హెచ్చరించారు. కార్మికులను వేధిస్తున్న పారిశుద్ధ్య నిర్వహణ సంస్థ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు రుయా ఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణకు వినతి పత్రం సమర్పించారు. ఏఐటీయూసీ నాయకులు రాజా, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర మాట్లాడుతూ గత కొంతకాలంగా ఏ వన్ సర్వీసెస్ సంస్థ పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షిస్తోందన్నారు. ఈ సంస్థ నుంచి సబ్ కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తి కార్మికులకు నెలవారీ వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించకుంటే సమ్మె బాట పడతామని హెచ్చరించారు. సంఘం నేతలు రవి, నరసింహులు, పార్వతి, రమాదేవి, లత, రమణమ్మ, కుప్పమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

తిరుపతి తుడా: నగర ప్రజల సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మేయర్ శిరీష తెలిపారు. మంగళవారం ఆమె నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజల నుంచి వచ్చిన పలు వినతులు స్వీకరించారు. తాగునీటి సరఫరాపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. పవర్ బోర్లకు మరమ్మతులు చేపట్టి, తాగునీటి సమస్యను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకునేందుకు యజమానులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. చెత్తాచెదారం కాలువలో వేయకుండా ప్రజల్లో అవగాహన రావాలని కోరారు. ప్రతిరోజు శుభ్రం చేస్తున్నా అవగాహన లేని కొంతమంది చెత్తను నిర్లక్ష్యంగా కాలువల్లో పార పోస్తున్నారన్నారు. గురువు కాలువల పునర్నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనల సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ నరేంద్ర, రాజు, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి పాల్గొన్నారు.



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మేయర్ శిరీష

న్యాయవాదిపై అక్రమ కేసు అన్యాయం

తిరుపతి లీగల్ : విజయవాడకు చెందిన న్యాయవాది ఒగ్గు గవాస్కర్‌పై మంగళగిరి రూరల్ పోలీసులు అక్రమ కేసు నమోదు చేయడం అన్యాయమని జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు దొరబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరహరరెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఈ మేరకు వారు మీడియాతో మాట్లాడారు. 2021లో టీడీపీ కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడి కేసులో పోలీసులు కొంతమందిపై కేసులు నమోదు చేశారని, వారి తరపున న్యాయవాది ఒగ్గు గవాస్కర్ కోర్టులో వకాల్తా పుచ్చుకున్నందకే ఇబ్బందిపెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో పోలీసులు ఇలాంటి తప్పుడు కేసులు నమోదు చేశారని, ఇలాంటి చర్యలను మానుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

కళాశాలల్లో 'భోజన' వసతికి వినతి

తిరుపతి సిటీ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సి.ప్రవీణ్‌కుమార్ కోరారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం సమర్పించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీ ప్రకారం కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టాలని సూచించారు. భోజన వసతి కల్పిస్తే గ్రామీణ ప్రాంతల్లో డ్రాప్ అవుట్లు తగ్గుతాయని వివరించారు. తమ విన్నపంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఆఫీసు బేరర్లు ఓం రాజ్, వినయ్, హరికృష్ణ పాల్గొన్నారు.

జంగావాండ్లపల్లెలో క్యాన్సర్ స్క్రీనింగ్




క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిన్నగొట్టిగళ్లు : తిరుపతి శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో మంగళవారం జంగావాండ్లపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ సింహాల విమలమోహన మాట్లాడుతూ పింక్ బస్సు ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోందన్నారు. మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సోమశేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మోహన్ రెడ్డి, నాగమణి పాల్గొన్నారు.

పేలిన గ్యాస్‌స్టౌవ్

పాకాల : మండలంలోని లింగనపల్లెలో మాజీ సర్పంచ్ గణేష్ ఇంట్లో మంగళవారం గ్యాస్ స్టౌవ్ పేలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకోకపోవడంతో అవాంఛనీయ ఘటనలు జరగలేదు.

భార్గవకు డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ బయోటెక్నాలజీ విభాగం పరిశోధక విద్యార్థి యలకంబేడు భార్గవకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ప్రొఫెసర్ జేఏస్ఆర్ మూర్తి పర్యవేక్షణలో ఐసోలేషన్, క్యారెక్టరైజేషన్ ఆఫ్ సింబయోటిక్ నైట్రోజన్ ఫిక్సింగ్ బాక్టీరియా ఫ్రం వైల్డ్ లెగ్యూమ్స్ టు ఎన్హాన్స్ ఆఫ్ క్రాప్ ప్రొడక్టివిటీ అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

జగనన్న ఆర్థిక భరోసా పంపిణీ

మంగళం : తిరుపతి రూరల్ మండలం ఉమ్మడి శెట్టి పల్లి పంచాయతీ పరిధిలోని సప్తగిరి కాలనీ, మంగళం క్వార్టర్స్, తిరుమల నగర్ పంచాయతీల పరిధిలో గాయాలపాలై, ఆస్తులు పోగొట్టుకున్న వారికి జగనన్న పంపిన చెక్కులను చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అందజేశారు. జగనన్న తమకు పంపిన చెక్కులను తీసుకున్న బాధితులు ఇది తమకు జగనన్న పంపిన డబ్బుగా చూడటం లేదని, ఆయన తమకు అండగా నేనున్నాను అన్న ధైర్యం పంపినట్లు భావిస్తున్నామని బాధితులు స్పష్టం చేయడం గమనార్హం. ఇకపై రెట్టింపు బాధ్యతతో పార్టీ పటిష్టతకు కష్టపడి పనిచేస్తామని వెల్లడించారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

కపిలేశ్వరాలయంలో ఆడికృత్తిక వేడుకలు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం ఆడికృత్తిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపించారు. పాలు, పెరుగు, తేనె, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. మధ్యాహ్నం మూలవర్లకు విశేషాభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు తిరువీధి ఉత్సవం జరిపించారు. అనంతరం ఉభయ దేవేరీ సమేతంగా స్వామివారు తిరుచ్చిపై కొలువుదీరి ఊరేగారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ కృష్ణవర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.



దేవదేవేరులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

మయూరంపై మురుగన్ విహారం

చంద్రగిరి : స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని పుట్టాలమ్మ ఆలయంలో వెలసిన శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువనే సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. షణ్ముఖుని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం శ్రీవల్లీ దేవసేన సమేతంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మయూర వాహనంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శివకుమార్ శర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సహకారంతోనే క్లీన్ తిరుపతి





చెత్త తొలగించాలని ఆదేశిస్తున్న కమిషనర్ మౌర్య, కమిషనర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి తుడా : నగర పరిశుభ్రతకు పెద్దపీట వేశామని, ప్రజలు సంపూర్ణ సహకారం అందిస్తేనే క్లీన్ తిరుపతి సాధ్యమవుతుందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తో కలిసి కమిషనర్ మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పారిశుద్ధ్య అమలు, చెత్త సేకరణ,తరలింపును పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఖాళీ స్థలాలలో వ్యర్థాలు, పిచ్చి మొక్కలు ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిచ్చి మొక్కలు తొలగించేందుకు సంబంధిత భూ యజమానులకు, సంస్థలకు వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మురుగు కాలువల్లో వ్యర్థాలను ప్రతిరోజూ తొలగించాలని స్పష్టం చేశారు. ఖాళీ స్థలాల్లో చెత్త పోసే వారిని గుర్తించి జరిమానా విధించాలని తెలిపారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు రాజీలేని నిర్ణయాలు అమలు చేస్తున్నామన్నారు. అయితే ప్రజలు పూర్తి అవగాహనతో చెత్తపై స్వీయ నియంత్రణ విధించుకోవాలని కోరారు. క్లీన్ చేసిన గంటల వ్యవధిలోనే చెత్తను ఖాళీ స్థలాలు, రోడ్లపై పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానానికి స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. చెత్తను పారిశుద్ధ్య కార్మికులకే అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈఈలు విజయ్‌కుమార్ రెడ్డి, సంజయ్, మహేష్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్సీ

తిరుపతి స్మార్ట్ సిటీ ఎండీగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ మౌర్యను ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మవారి సేవలో చెన్నై భక్త బృందం



గొడుగులను కానుకగా అందిస్తున్న భక్త బృందం

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని చెన్నైకు చెందిన శ్రీఅల్లూరి వెంకటాద్రి స్వామి శ్రీశ్రీనివాస భక్త భజన బృందం మంగళవారం రాత్రి దర్శించుకుంది. తిరుమలకు వెళ్లే క్రమంలో సుమారు 250 మందితో భక్తులు చెన్నైను నుంచి పాదయాత్రగా మంగళవారం రాత్రి తిరుచానూరుకు చేరుకున్నారు. అక్కడ ఆలయ సూపరింటెండెంట్ మధుకు అమ్మవారి కోసం తీసుకొచ్చిన రెండు నూతన గొడుగులను కానుకగా అందజేశారు.